# జవాబుదారీగా పనిచేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, జూలై8: జిల్లాలోని అన్ని శాఖల అధికారులు జవాబుదారీగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న ప్రజావాణిలో ఏఏ శాఖ వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో తెలుపాలని ఆదేశించారు. మొత్తం ప్రజావాణికి 312దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

### రైతులకు పట్టాలు ఇప్పించాలి

సిరిసిల్ల పట్టణంలోని 9వ వార్డు సర్దాపూర్, పెద్దూరులోని ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు ఇండ్ల నిర్మాణానికి నివేశన స్థలం పట్టాలు ఇప్పించాలని కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ కలెక్టర్‌ను కోరారు. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని వారికి వారి వ్యవసాయ భూముల్లోనే ఇంటి నివేశన స్థలం పట్టాలు ఇప్పించాలని కోరారు. అలాగే సిరిసిల్ల మండలం పెద్దూరు-2వ బైపాస్‌లో సిరిసిల్ల మెడికల్ కాలేజీకి సర్వే నంబర్ 408లో 36ఎకరాలు ప్రభుత్వానికి కేటాయించగా, ఇప్పటి వరకు బాధితులకు భూములు కేటాయించలేదని కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ కలెక్టర్‌కు వినతిపత్రం అం దించారు. కళాశాల భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు వెయ్యి గజాలు చొప్పున భూములు కేటాయిస్తూ నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి

డబుల్ బెడ్రూం, గృహజ్యోతి, పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు, పోడు భూములు, అభయహస్తం సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కోరారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, జిల్లాలో నిర్మాణం పూర్తయి డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే అర్హులైన పేదలకు అందించాలని కోరారు. గృహజ్యోతికి అందరికీ వర్తింపచేయాలన్నారు. పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు, అభయహస్తం నగదు అందించాలని కోరారు. పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి ఆందోళనలు చేపడుతామన్నారు. ఇక్కడ జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, జవ్వాజి విమల, సురం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, తదితరులు ఉన్నారు.

# వ్యాయామం అలవాటు చేసుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- నూతన జిమ్ ప్రారంభోత్సవం

జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణచౌక్, జూలై 8: ప్రతిరోజూ వ్యాయమం చేయడం అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో అత్యాధునిక వసతులతో కూడిన వ్యాయమశాల(జిమ్)ను సోమవా రం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా ప్రతిరోజూ బిజిగా ఉండే పోలీస్ అధికారులు తమ శారీరక వ్యాయామంపై దృష్టి సారించాలని సూచించారు. అత్యాధునిక వసతులతో కూడిన జిమ్‌తో పాటుగా కోచ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇక్కడ వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, సీఐ కృష్ణ, మొగిలి, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

### 'గ్రీవెన్స్ డే'తో సత్వర న్యాయం

బాధితులకు సత్వర న్యాయం అందించడానికే గ్రీవెన్స్ డే ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు ఎస్పీ స్వయంగా అందుబాటులో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 18ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారులకు దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

### 10న హుండీ లెక్కింపు

వేములవాడ రూరల్, జూలై 8: అగ్రహారం హనుమాన్ ఆలయంలో ఈ నెల 10న హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో హుండీ లెక్కింపు ఉంటుందని చెప్పారు. దేవాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు, వ్యవసాస్థక కుటుంబస భ్యులు హాజరవుతారని చెప్పారు.

### 11న విద్యుత్ సమస్యలపై సమావేశం

సిరిసిల్ల రూరల్, జూలై 8: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఈ నెల 11న సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సమావేశం ఏర్పాటు చేసినట్లు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు బియ్యాంకార్ శ్రీనివాస్, చికోటి అనిల్, కుసుమ గణేశ్, బోగి రాజయ్య పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ కస్టమర్ గ్రీవియెన్స్ రీడ్రెస్సల్ ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో తరుచుగా వచ్చే కరెంట్ అంతరాయం, లో ఓల్టేజీ సమస్య, హెచ్చుతగ్గదలకు గల కారణాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

# నేడు తండాల్లో 'శీత్లా' సందడి

శీత్లాభవానీ వేడుకలో పాల్గొన్న గిరిజనులు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై8: తరతరాలుగా ప్రకృతితో మమేకమై చెట్టుకింద కొలువై ఉండే ఏడుగురు దేవతలను లంబాడాలు ఆనవాయితీగా కొలుస్తుంటారు. మేరమ్మ, త్వల్జా, సీత్లా, మంత్రల్, హింగ్ల, ద్వాల్‌అంగల్, కంకాళీ మాతలకు మొక్కులు చెల్లించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలోని మంగళవారంలో ఏడుగురు దేవతల్లో ఒకరైన శీత్లాభవానీకి ప్రత్యేక పండుగను జరుపుతున్నారు. గిరిజనుల బతుకుదెరువుకు ఆధారమైన పశువులు, గొర్లు, మేకలు, కోళ్లకు ఏ రోగం రాకుండా ఉండాలని, దూడలకు పాలు సరిపోను ఉండాలని, మేతకు గడ్డి దొరకాలని, క్రూరమృగాల బారినుంచి రక్షించాలని.. అడవిబిడ్డలు ఆర్తిగా ప్రకృతి రక్షిత మాత శీత్లాభవానీని వేడుకునే సందర్భంగా పండుగను జరుపుకొంటారు. అడవితో జంతువులు, వాటితో మనుషులు పరస్పర ఆధారమనే సత్యాన్ని పండుగ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పే మహత్తర ప్రకృతి ఆరాధ్య పండుగ శీత్లాభవానీ. అడవితల్లి పండుగలను మరిచిపోకుండా పట్టణా లు, నగరాల్లో స్థిరపడ్డ యువతీయువకులు సైతం తండాలకు చేరుకుంటున్నారు. వన దేవతలకు మక్క గుడాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారు శీత్లాభవానీకి యాటను బలిచ్చి పేగుపై నుంచి గిరిజనుల పాడి, పశువులను దాటించి రోగాలు రాకుండా కాపాడాలని వేడుకుంటారు. అనంతరం అక్కడే అతిథులు, కుటుంబ సభ్యులతో విందు భోజనాలు ఆరగిస్తారు.

### అన్నీ ఇచ్చింది అడవే...

మాకు అన్నీ ఇచ్చింది అడవే. మా బతుకుదెరువు అడవి మీదే ఆధారపడ్డది. ఎనుకట మా ముసలోల్లు తీరొక్క చెట్టుకు పండిన పండ్లను తిన్నరు. ఇక్కన్నే ఎవుసం చేసుకుంటూ బతికిన్రు. మేము ఇక్కడే బతుకుతున్నం. గొర్లు, మేకలు, ఆవులే మాకు ఆస్తి. అవి మంచిగుంటేనే మాకు బతుకు. అవ్విటిని సల్లంగ సూడాలని ప్రతి ఏడాది శీత్లాభవానీ పండుగ చేసుకుంటున్నం. దూరప్రాంతాల్లో ఉన్నవారంతా పండుగ రోజు తండాలకు వస్తరు.

*– భూక్యా దేవీలాల్, బంజారా సేవాలాల్ సంఘం మండలాధ్యక్షుడు (ఎల్లారెడ్డిపేట)*

### రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, జూన్ 8: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌పై ఉదయం 8 గంటలకు నిర్వహించే హుండీ లెక్కింపులో ఆలయ ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఈవో వినోద్‌రెడ్డి కోరారు.

### ఘనంగా నవకోటి దత్తహోమం

వేములవాడ టౌన్, జూన్ 8: లోక కల్యాణార్థం వేములవాడ పట్టణంలోని భీమేశ్వరాలయం వీధిలో గల బాలాంబిక సదన్‌లో శ్రీ రాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవకోటి దత్త హోమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థస్వామి ఆశీస్సులతో దత్తహోమ కార్యక్రమాన్ని నిర్వహించామని నిర్వాహకుడు పంతంగి రమేశ్‌శర్మ తెలిపారు.

సిరిసిల్ల నియోజకవర్గంలో

# బండి సంజయ్ పర్యటన

- పలు కుల సంఘాల భవన నిర్మాణాలకు భూమిపూజ
- రైల్వేలైన్, టెక్స్‌టైల్ పార్క్, రహదారులు, బీడీ కార్మిక దవాఖాన నిర్మాణాలపై చర్చించకపోవడంపై విమర్శలు

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలో గౌడ సంఘ భవన ప్రహరీ పనులను ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

వీర్నపల్లి/సిరిసిల్ల రూరల్/ ముస్తాబాద్, జూలై 8: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. వీర్నపల్లి, తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పర్యటించి పలు కులసంఘాల భవన నిర్మాణ పనులకు పార్టీ శ్రేణులతో కలిసి శంకుస్థాపన చేశారు. వీర్నపల్లి మండలం శాంతినగర్ పరిధిలోని బండతండాలో ₹3లక్షలతో ఎస్టీ కుల సంఘ భవనం, వన్‌పల్లిలో ₹3లక్షలతో రెడ్డి సంఘ భవనం, గర్జనపల్లిలో మినరల్ వాటర్‌ప్లాంట్, బోరుమోటర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మహిళా సంఘ ప్రహరీ, తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గౌడ సంఘ భవన ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నియోజవర్గానికి విచ్చేసిన బండి సంజయ్‌కుమార్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికి సత్కరించారు.

### ₹3లక్షల పనికే..సెంట్రల్ మినిస్టరా?

తంగళ్లపల్లిలో గౌడ సంఘ భవన ప్రహరీ నిర్మాణ పనులకు ఎంపీ నిధుల నుంచి బండి సంజయ్‌కుమార్ ₹3లక్షలు మంజూరు చేశారు. కేవలం ₹3లక్షల పనులకే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ భూమిపూజ చేయడం చర్చానీయాంశమైంది. తొలిసారిగా విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి మండలంలోని రైల్వేలైన్, టెక్స్‌టైల్ పార్క్, రహదారులు, బీడీ కార్మిక దవాఖాన నిర్మాణం పనులపై చర్చించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. కార్యక్రమంలో బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి రాణి రుద్రమదేవి, పార్లమెంట్ కో కన్వీనర్ రవీందర్, మండలాధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఉన్నారు.

### ప్రజావాణికి అధికారుల డుమ్మా

బోయినపల్లి, జూలై 8: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అధికారులు డుమ్మాకొట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం తహసీల్ ఆఫీస్‌లో నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలి. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను తహసీల్దార్ పుష్పలత రిజిష్టర్‌లో నమోదు చేసి సంబంధిత శాఖకు పంపిస్తారు. కానీ కొద్ది నెలలుగా ఈ ప్రజావాణికి పలు శాఖల అధికారులు సక్రమంగా హాజరు కావడంలేదు. మొక్కుబడిగా కొన్ని శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపేసుకుంటున్నారని విమర్శలున్నాయి. సోమవారం జరిగిన ప్రజావాణికి తహసీల్దార్ పుష్పలత, ఏవో ప్రణీత, మండల పరిషత్ సూపరింటెండెంట్ రవీందర్ హాజరయ్యారు. సెస్, పశు, వైద్య, విద్య, ఐకేపీ, ఈజీఎస్, నీటి పారుదల, రోడ్డు భవణాలు, భగీరథ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

### విద్యుత్ మోటర్ చోరీ

ఇల్లంతకుంట, జూలై 8: ముస్కానిపేటలో సింగిరెడ్డి అనంతరెడ్డికి చెందిన విద్యుత్ మోటర్‌ను ఆదివారం రాత్రి దుండగులు దొంగిలించారు. వారం రోజులుగా గ్రామంలో పలుచోట్ల బైక్‌ల కీలు ఎత్తుకెళ్లడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# వైఎస్ఆర్‌కు ఘన నివాళి

వేములవాడ: పట్టణంలోని మూలవాగు వంతెన వద్ద దివంగత వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

వేములవాడ/కోనరావుపేట/ ఇల్లంతకుంట/ రుద్రంగి, జూలై 8: దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108అంబులెన్స్ వంటి అనేక సంక్షేమ పథకాలను ఆయన పేదల కోసం తీసుకువచ్చారని గుర్తుచేశారు. వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతెన వద్ద వైఎస్సార్ చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచిపెట్టారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వైస్ఆర్ చిత్రపటానికి పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరా చౌక్ వద్ద రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బర్కుటం ఎల్లవ్వ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కొండూరి రవీందర్‌రావు

### కొండూరి పరామర్శ

గంభీరావుపేట, జూలై 8: మండల కేంద్రానికి చెందిన బర్కుటం నర్సవ్వ, ఇరిగి ఎల్లవ్వ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, పట్టణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, నాయకులు ఎగదండి స్వామి, గోగు లింగం యాదవ్, దేవరాజు, సందీప్ ఉన్నారు.

అనుకూలిస్తున్న కాలం..

# ఆశాజనకంగా పంటలు

- వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీబిజీ

పరికరం సాయంతో పత్తి చేనులో కలుపు తీస్తున్న మామిడిపల్లి గ్రామ యువ రైతు

కోనరావుపేట, జూలై 8: కాలం అనుకూలిస్తుండడంతో పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. రైతులు విత్తనాలు విత్తడం మొదలు.. మొలకేత్తే దశ వరకు అనువైన సమయంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మొలకలు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాయి. పత్తి వేసిన రైతులు పంట కాలం 25రోజులు పూర్తికావడంతో కలుపు మొక్కలు తీయడంతోపాటు డౌరలు కొట్టే పనుల్లో నిమగ్నమయ్యా రు. కలుపు తీసిన రైతులు రసాయనిక ఎరువులు డీఏపీ, యూరియా వేస్తున్నారు. పత్తి లో కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నచోట గడ్డి మందు పిచికారి చేస్తున్నారు. దీంతో ఏడాది పత్తి అనుకూలంగా వానలు కురుస్తున్నాయని పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### వరి పంటే అత్యధికం

మండలంలో వానకాలం కింద వరి, పత్తి, కంది వంటి పంటలను సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరి పంట 17,745, పత్తి 5,304, కంది 125ఎకరాల్లో రైతులు పంటలను వేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే వ్యవసాయ బావులు, బోరుమోటార్ల కింద ఉన్న రైతులు వరి నాట్లు వేస్తున్నారు. కానీ వర్షాలు ఎక్కువ మొత్తంలో కురియక, చెరువులు, కుంటలు నిండకపోవడంతో రైతులకు వరి సాగుకు నీరు అందలేకపోతుంది. దీంతో వరినారు పోసిన రైతన్నలు భారీ వర్షం కురిస్తే పొలం దున్నేందుకు సిద్ధంగా ఉన్నారు.

### సూచనలు పాటించాలి

ఈ ఏడాది పత్తి పంటకు వర్షాలు సమయానుకులంగా పడుతున్నాయి. కానీ వరి సాగు చేసేందుకు భారీ వర్షాలు కురియలేదు. పత్తి పంట వేసిన రైతులు కలుపు మొక్కల నివారణకు గడ్డి మందు వాడకుండా కూలీల సాయంతో కలుపు నివారణ చేపట్టాలి. మోతాదులో ఎరువులు వేయాలి. అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చు.

*– వెంకట్రావమ్మ, ఏవో (కోనరావుపేట)*

### మొక్కలు నాటి సంరక్షించాలి

వేములవాడ రూరల్, జూలై 8: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని వేములవాడ రూరల్ మండల ప్రత్యేకాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. సోమవారం మర్రిపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మొక్కలు నాటారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

### ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

వేములవాడ రూరల్, జూలై 8: మల్లారంలో ఇసుక తరలింపును పలువురు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసలే వర్షాలు లేక ఇబ్బంది పడుతున్నామని, మూలవాగులోని బావుల వద్ద ఇసుకను తీయడంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయన్నారు. ఇసుక తరలింపును నిలిపివేయాలని కోరుతూ ట్రాక్టర్లను అడ్డుకున్నామన్నారు. ఇసుక తరలింపునకు తహసీల్దార్ అనుమతులు ఇచ్చారని ట్రాక్టర్ యజమానులు పేర్కొన్నారు. బావుల వద్ద నుంచి ఇసుకను తరలించవద్దని పోలీసులు సూచించడంతో సమస్య సద్దుమణిగింది.

ఎల్లారెడ్డిపేట: పరశురాములుకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

### ప్రతిభా పురస్కారాలు

ఎల్లారెడ్డిపేట/వేములవాడటౌన్, జూలై 8: తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు వాసరవేణి పరశురాములు, విద్యాశాఖలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న కోరెం రమేశ్‌కుమార్ సిద్ధప్ప వరకవి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారం గ్రహించారు. కొన్నేండ్లుగా చేస్తున్న సాహితీ సేవలకు గానూ పురస్కారం లభించినట్లు పరశురాములు, రమేశ్‌కుమార్ తెలిపారు. వీరికి పలువురు శుభాకాంక్షలు చెప్పారు.

వేములవాడటౌన్: ప్రతిభా పురస్కారం అందుకుంటున్న రమేశ్‌కుమార్

### ఏజీపీగా అనిల్‌కుమార్

వేములవాడ టౌన్, జూన్ 8: వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదిగా పొత్తూరి అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేములవాడ కోర్టు హాల్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆయనను సన్మానించారు.

ఏజీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న పొత్తూరి అనిల్‌కుమార్

### బాధ్యులను శిక్షించాలి

వేములవాడ, జూలై 8: పోలీస్‌శాఖలో అగ్రవర్ణాల దురహంకారానికి అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ బలయ్యాడని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ ఆరోపించారు. సోమవారం ఆయన నాయకులతో కలిసి ఎస్ఐ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుల అహంకార ధోరణితో అగ్రకుల అధికారులు ఎస్ఐ శ్రీనివాస్‌ను కులం పేరుతో తిడుతూ మానసికంగా వేధించడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు సాగర్, వేణు, శ్రీకాంత్, నాగరాజు, ప్రవీణ్ ఉన్నారు.

### షార్ట్‌ఫిలీం షూటింగ్

సిరిసిల్ల రూరల్, జూలై 8: తంగళ్లపల్లి మండల కేంద్రంలో సోమవారం షార్ట్ ఫిలీం షూటింగ్ జరిగింది. దివంగత మాజీ ఎమ్మెల్యే నర్సింగరావు గృహంలో షూటింగ్ జరిపామని నిర్వాహకులు తెలిపారు. షార్ట్ ఫిలీంను ఏఎన్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని డైరెక్టర్ అల్లు ఆర్‌జే తెలిపారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట, జూలై 8: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి పేర్కొన్నారు. లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి గానూ సోమవారం వెంకటాపూర్‌లో అర్బన్ లైన్‌ను ప్రారంభించారు. ఇక్కడ సెస్ ఈడీ మహేందర్, ఏఈ పృథ్వీ, మాజీ ఎంపీటీసీ మామిండ్ల తిరుపతిబాబు, నాయకులు కోల నర్సయ్య, మేడిశెట్టి శ్రీనివాస్, పులి రమేశ్ ఉన్నారు.

### 'ఆదర్శ'లో మాక్ పోలింగ్

ఇల్లంతకుంట, జూలై 8: రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించామని ప్రిన్సిపాల్ మధుకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఈ నమూనాను నిర్వహించినట్లు తెలిపారు.

### వేడుకకు హాజరైన చల్మెడ

వేములవాడ, జూలై 8: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లింగం రాజేశ్ కూతురు జన్మదిన వేడుకలను సోమవారం కట్టరాజయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ వేడుకకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై, చిన్నారి లక్ష్మివిహాన్నిని ఆశీర్వదించారు. వారి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, సిరిగిరి రామచందర్, జోగిని శంకర్, నాయకులు ఉన్నారు.

### ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

వేములవాడ రూరల్, జులై 8: పోచెట్టిపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగల సంకల్ప బలానికి 30ఏండ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమం నిదర్శనమన్నారు. ఉద్యమానికి అండగా ఉన్నవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, Marampelly Srinivas R/o. Nookapalle, Jagtial, T.G. Have changed my Surname as MARAMPALLI SRINIVAS S/o MARAMPALLI MEENAIAH.
NTK-00000

CHANGE OF NAME

★Bojja Gattu Mohan S/o Venkaiah, H.no. 3-37, (v) Ashireddypelli, (m) Chandurthi Dist Rajanna Sircilla my Surname was changed as Gattu Mohan S/o Venkaiah.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైన